సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



మహిమాన్వితం ..

చవితి ఉత్సవాలు వచ్చాయంటే చాలు అందరి దృష్టి బాలాపూర్ గణేశుడిపైనే. లడ్డూ వేలానికి ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. 8లో▸



అర్ధరాత్రి దొంగల బీభత్సం

పట్టణ కేంద్రంలోని ఎల్ఐసీ ప్రీమియం పాయింట్‌లో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. 8లో▸



కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటు కీలకమని మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. 8లో▸

సారు.. దొరకరు!

ఉదయం 11 దాటినా తెరుచుకోని ఆఫీసులు

- ప్రజలకు దూరంగా అధికారులు
- జిల్లాలో గాడితప్పిన పాలన
- కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న బాధితులు



కలెక్టరేట్‌కు క్యూ కట్టిన బాధితులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/ఇబ్రహీంపట్నం రూరల్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి.. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు చిక్కరు.. దొరకరు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సారు.. కోర్టుకు వెళ్లారని రెవెన్యూ సిబ్బంది చెబుతుండగా.. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారని ఇతర శాఖల ఉద్యోగులు చెబుతుండటం గమనార్హం. సాక్షాత్తు జిల్లా ఉన్నతాధికారి మొదలు.. ఆర్డీఓలు, తహసీల్దార్ల వరకు ఇదే వరుస. ఉన్నతాధికారులతో సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, కోర్టు కేసుల పేరుతో రోజుల తరబడి ప్రజలకు దూరంగా ఉంటున్నారు. నిజానికి ఉదయం 10 గంటలకే ఆఫీసులకు చేరుకోవాల్సిన ఆయా శాఖల అధికారులు సాయంత్రం మూడు నాలుగు తర్వాత వచ్చి, రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ధరణి సంబంధిత సమస్యలే కాదు కుల, ఆదాయ, నివాస సహా జనన, మరణ, వారసత్వ ధ్రువీకరణ పత్రాల జారీ సంబంధిత సమస్యలపై ఆయా కార్యాలయాలకు చేరుకుంటున్న వారికి తిప్పలు తప్పడం లేదు.

పాలన గాలికి..

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, పశు సంవర్థక, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, ఎక్సైజ్ మినహా మిగిలిన శాఖలన్నీ సమీకృత జిల్లా అధికారుల సముదాయంలోనే ఏర్పాటు చేశారు. రెండు, మూడు శాఖల అధికారులు మినహా ఇతరులెవరూ అందుబాటులో ఉండటం లేదు. ఎవరైనా బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి సంబంధిత అధికారిని కలిసేందుకు వెళ్తే.. సారు జస్ట్ ఇప్పుడే బయటికి వెళ్లిపోయారని అక్కడి సిబ్బంది చెబుతుండటం గమనార్హం. కలెక్టరేట్‌లో పరిస్థితి ఇలా ఉంటే.. రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో అధికారుల పనితీరు మరింత దారుణంగా తయారైంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతను పూర్తిగా గాలికొదిలేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కొత్త రేషన్ కార్డుల జారీ, దళిత బంధు, పెన్షన్ కార్డుల జారీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాల జారీలోనూ తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది.

పెండింగ్‌లోనే వేలాది దరఖాస్తులు

మ్యూటేషన్, సక్సేషన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్, ఇతర ఫిర్యాదులపై ధరణిలో వచ్చిన దరఖాస్తులకు క్షేత్రస్థాయి నుంచి అందిన రిపోర్టులే కీలకం. నెలల తరబడి క్షేత్రస్థాయి నుంచి రిపోర్టులు అందకపోవడంతో ఆయా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో 25 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

ప్రజావాణికి వెల్లువలా అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపడం లేదు. ఇందుకు సోమవారం ప్రజావాణిలో అందిన ఫిర్యాదులే నిదర్శనం. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏకంగా 498 మంది అర్జీలను అందజేశారు. బాధితుల నుంచి స్వీకరించిన అర్జీలకు సరైన పరిష్కారమార్గం చూపకపోవడంతో వారంతా మళ్లీ మళ్లీ కలెక్టరేట్‌కు వస్తున్నారు. తమ గోడును ఉన్నతాధికారులకు వెల్లబోసుకునేందుకు అనేక వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి చేరుకుంటే తీరా.. ఆఫీసులో అటెండర్లు, సెక్షన్ ఆఫీసర్లు మినహా ఉన్నతాధికారులెవరూ కన్పించక పోవడంతో వారంతా ఉసూరుమంటున్నారు.

రెండేళ్లుగా తిరుగుతున్నా..



షాబాద్ మండలం హైతాబాద్‌లో నా భార్య కళమ్మ పేరు మీద సర్వే నంబర్ 52లో 10 గుంటల భూమి ఉంది. విస్తీర్ణం ధరణిలో కనిపించడం లేదని మీ సేవలో దరఖాస్తు చేసుకున్నా. రెండేళ్లుగా ఎవరూ స్పందించడం లేదు. ప్రజావాణికి 10–15 సార్లు వచ్చాను. రావడం, పోవడం తప్ప పని కావడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– దర్శన్, హైతాబాద్, షాబాద్

పని కావడం లేదు



యాచారం మండలం, చింతపట్ల రెవెన్యూలో ఆరు ఎకరాల పోలం ఉంది. 1954 నుంచి పట్టా భూమిగా వచ్చింది. భూప్రక్షాళన అనంతరం పట్టా భూమి కాస్తా ప్రభుత్వ భూమిగా పడింది. ఆరు నెలలుగా అధికారులు సతాయిస్తున్నారు. తహసీల్దార్ రికార్డు రాసి పంపించారు. అయినా కలెక్టరేట్‌లో పని కావడం లేదు.

– మర్పల్లి అంజయ్య యాదవ్, యాచారం

అర్జీ పెట్టుకున్నా అంతే..



శంషాబాద్ మండలం రషీద్‌గూడలోని సర్వే నంబర్ 57లో ఉన్న మా భూమిని ప్రభుత్వ అండదండలతో కొంతమంది కబ్జా చేశారు. దౌర్జన్యంగా ఇళ్లు నిర్మించుకున్నారు. కబ్జా నుంచి కాపాడాలని అధికారులకు మొరపెట్టుకున్నా న్యాయం జరగడం లేదు. ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది.

– సోమశిల లక్ష్మీపతి, శంషాబాద్

నిత్యం తిరగాల్సి వస్తోంది



మా తండ్రి వెంకటరామయ్య పేరుమీద 2010–11లో భూమి కొన్నాం. 2015 వరకు రికార్డుల్లో మా పేరు వచ్చింది. 2015 నుంచి ధరణిలో చూపించడం లేదు. నిత్యం తిరగాల్సి వస్తోంది. తహసీల్దార్ కార్యాలయానికి పోతే కలెక్టరేట్‌కు పోవాలని అక్కడికి పోతే ఇక్కడికి రావాలని తిప్పుతున్నారు తప్ప పని కావడం లేదు.

– లోకేష్, షాద్‌నగర్

న్యూస్‌రీల్

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: బీజేపీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం కార్పొరేషన్‌లోని పార్టీ క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, గాజుల మధు, ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు కరుణానిధి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

షాద్‌నగర్‌రూరల్: నాగర్‌కర్నూల్ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ కోర్సు ల్లో ఎస్సీ కేటగిరీ విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లు పొందొచ్చని తెలిపారు.పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతు న్న నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 1లోపు సంప్రదించాలని సూచించారు.

టీఎస్‌పీఎస్సీ కమిటీని రద్దు చేయాలి

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉద్యోగ నియామకాల్లో పేపర్ లీకేజీలకు పాల్పడి నిరుద్యోగులతో చలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ కమిటీని రద్దు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం స్వేరో డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ కేసుని సీబీఐకి అప్పగించాలని కోరారు. సిట్ విచారణలో చైర్మన్, సభ్యులు, ఎస్ఓ వెంకటలక్ష్మిని నిందితులుగా చేర్చాలని, అసమర్థ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెస్ట్ జిల్లా అధ్యక్షుడు రాచమల్ల జయసింహ, జిల్లా ఇన్‌చార్జి గ్యార జగన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన



వ్యవసాయ చట్టాలపై రైతులకు వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

అబ్దుల్లాపూర్‌మెట్ : వ్యవసాయ చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి డి. ఇందిర అన్నారు. రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండల వ్యవసాయ శాఖల సంయుక్తాధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రైతు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి, మండల కో ఆర్డినేటర్ బలదేవ్‌రెడ్డి, హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి కవిత, సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, అధికారులు సత్యనారాయణ, రామ్మోహన్, సాల్మన్‌నాయక్ పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ స్పెషల్స్

సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనం సందర్భంగా 8 ఎంఎంటీఎస్ సర్వీసులను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ రాత్రి 11 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 4 గంటల వరకు ఈ రైళ్లు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తాయి.

క్రీడలతో జాతీయ సమైక్యత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: క్రీడలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికలపై మన దేశ, రాష్ట్ర ప్రతిష్టను నిలబెట్టే అంశాల్లో క్రీడలు ప్రముఖపాత్ర వహిస్తాయన్నారు. మైనార్టీ గురుకులాల్లోని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, స్థానిక సర్పంచ్ నరోత్తంరెడ్డి, టీఎంఆర్ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ, జిల్లా ఇన్‌చార్జి షేక్ లియాకత్ హుస్సేన్ అలీ, మండల విద్యాధికారి వెంకటయ్య, రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విజిలెన్స్ ఆఫీసర్ రహీం, వైస్ ఎంపీపీ మమత, ఎంపీటీసీలు సుమలత, బట్టు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

టికెట్ ఇంకా ఖరారు కాలేదు

- అవాస్తవాలను ప్రచారం చేయొద్దు
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఏ అసెంబ్లీ స్థానం నుంచి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించలేదని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధిష్టానం అన్ని నియోజకవర్గాల నుంచి ఆశావహుల పేర్లను పరిశీలనలోకి తీసుకుని పరిశీలిస్తోందన్నారు. కొందరు తమకే పార్టీ టికెట్ ఖరారైందని ప్రచారం చేస్తూ అయోమయానికి గురిచేస్తున్నారని అన్నారు. ఆశావహులమంతా ఎవరికి వారు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, పార్టీ బీఫాం ఇవ్వాలనుకున్నప్పుడు అందరినీ పిలిచి వారి అభిప్రాయాలను అధిష్టానం పరిగణలోకి తీసుకుని టికెట్ కేటాయిస్తుందని పేర్కొన్నారు. అందరూ ఏఐసీసీ ఆదేశాల కే కట్టుబడి ఉండాలని, అవాస్తవాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ గెలిచే స్థానమని, ఇలాంటి సమయంలో అవాస్తవాలు ప్రచారం చేయొద్దన్నారు. ఎవరికైనా టికెట్ ఖరారైతే అధిష్టానమే అధికారికంగా ప్రకటిస్తుందన్నారు. అంతా కలసి కట్టుగా ఉండి పార్టీ విజయానికి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఎల్మేటి అమరేందర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి, డివిజన్, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమమే మా నినాదం

- మంత్రి సబితారెడ్డి



తిమ్మాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి. చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

కందుకూరు: సంక్షేమం, అభివృద్ధి తమ నినాదం, విధానమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సరస్వతిగూడ, అగర్‌మియాగూడ, లేమూరు, తిమ్మాపూర్, జబ్బార్‌గూడ, మాదాపూర్, కొలన్‌గూడ, గుమ్మడవెల్లి, రాచులూరు, బైరాగిగూడల్లో రూ.12.55 కోట్ల నిధులతో చేపట్టిన 64 అభివృద్ధి పనులకు సోమవారం జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాగా ముందుకెళ్తున్నామన్నారు. తొమ్మిదేళ్లకు ముందు ప్రస్తుతం ఈ ప్రాంతం ఎలా ఉందో పరిశీలిస్తే ఎంత మేర అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. పల్లె ప్రగతి, స్వచ్ఛత తదితర అంశాల్లో తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డులు రావడమే అందుకు నిదర్శనమన్నారు. అక్టోబర్ 1న మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మెట్రో రైలు కందుకూరుకు రానుందన్నారు. తాము చేసే అభివృద్ధిని చూసి ప్రజలు తమ పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగంలాంటిదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచులు రాము, భూపాల్‌రెడ్డి, పరంజ్యోతి, గోపాల్‌రెడ్డి, సుగుణమ్మ, మందసాయలు, గీతేశ్వరి, ప్రభాకర్, శ్రీనివాస్‌చారి, వాసవీరేఖ, ఎంపీటీసీలు యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి, రేఖ, రాములు, ఇందిర, బాల్‌రాజు, మాజీ ఎంపీపీ శోభఈశ్వర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో అధిక ప్రయోజనాలు

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సునందారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి సునందారెడ్డి

ఆమనగల్లు: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డా.ఎం.సునందారెడ్డి అన్నారు. రైతులు ఆయిల్‌పాం సాగుచేసి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాంనుంతల గ్రామంలోని రైతు వేదిక భవనంలో సోమవారం జిల్లా ఉద్యాన శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై మహేశ్వరం, ఆమనగల్లు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సునందారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం పంటలను సాగుచేస్తే అనేక రాయితీలు ఉంటాయని తెలిపారు. ఒక ఎకరా పొలంలో సాగుచేస్తే 57 మొక్కలు నాటాలని.. దీనికి మొక్కకు రూ.20 చొప్పున రైతు డీడీ రూపంలో చెల్లిస్తే మిగతా మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుందని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం రూ.22,518 సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. నాలుగేళ్లపాటు ఎకరాకు రూ.4,200 చొప్పున ఇవ్వడం జరుగుతుందని.. మొత్తం ఎకరా సాగుకు రైతుకు రూ.50,918 సబ్సిడీ రూపంలో అందుతుందని ఆమె తెలిపారు. అనంతరం ఆయిల్‌పాంకు సంబంధించి అనుకూలమైన నేలలు, నీటి లభ్యత, మొక్కలు నాటే విధానం, సాగునీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, అంతరపంటల సాగు, గెలల దిగుబడి, గెలల కోత తదితర విషయాలపై ఉద్యానశాఖ రాష్ట్ర ఆయిల్‌పాం కన్సల్టెంట్ డా.బి.ఎస్.రావ్ వివరించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏడీఏ సుజాత, ఉద్యానశాఖ ఏడీ సంజయ్‌కుమార్, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ రఘు, ఉద్యానశాఖ అధికారి వి.అశోక్, ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి నిరంతరాయ విద్యుత్

సీఎండీ రఘుమారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 28న నగరంలో నిర్వహించే గణేశ్ శోభాయాత్రకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సర్వం సిద్ధం చేసిందని ఆ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం పారంభించారు. నిమజ్జన సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరా తీరు తెన్నులను ఆపరేషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. చీఫ్ జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు తమ జోనల్, సర్కిల్ పరిధుల్లో నిర్వహించే నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంలతో పాటు, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన జాయింట్ కంట్రోల్ రూంలలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

రాజీనామా యోచనలో కసిరెడ్డి?

ఎమ్మెల్సీకి రిజైన్ చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం



కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అనుచరుల ఒత్తిడి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు పార్టీ మారనున్నట్లు చర్చ జరుగుతోంది. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకూ మారుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం కల్వకుర్తి టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో టికెట్ తనకే వస్తుందని ఆశించిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి నిరాశ మిగిలింది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాల్సిందే అంటూ కేడర్ కొన్ని రోజులుగా ఒత్తిడి తీసుకువస్తోంది. ఇదే సమయంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు ఎమ్మెల్సీతో కాంగ్రెస్ అధిష్టానం కూడా మాట్లాడి ఆహ్వానించినట్లు సమాచారం. కల్వకుర్తి టికెట్ ఇవ్వడానికి కాంగ్రెస్‌పార్టీ సుముఖంగా ఉండటంతో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే తన అనుచరులతో పలు సమావేశాలు నిర్వహించిన ఆయన నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి, ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తే ఉండే విజయావకాశాలపై సర్వే జరిపించినట్లు తెలుస్తోంది. గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సర్వేలో తేలినట్లు సమాచారం. దీంతో కారు దిగి చేయి అందుకోనున్నట్లు సమాచారం. మరో వైపు ప్రగతి భవన్‌లో సోమవారం సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కలిసి తన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఏదేమైనా నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి.

విద్యార్థి దశ నుంచే రక్తదానం అభినందనీయం

- గవర్నర్ తమిళిసై



రక్తదానం చేస్తున్న విద్యార్థినులను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

వెంకటేశ్వరకాలనీ: విద్యార్థి దశ నుంచే రక్తదానంపై అవగాహన ఉండటంతో పాటు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ఫార్మసిస్ట్ వేడుకల సందర్భంగా అవయవదానాన్ని ప్రోత్సహించాలని ఇంటర్నేషనల్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ నిర్ణయించిందన్నారు. అవయవదానం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించేందుకు నిర్ణయించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన వారిలో చాలా మంది అమ్మాయిలు ఉండటం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కడ్తాల్: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన, మండల పరిధిలోని కడ్తాల్– షాద్‌నగర్ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన జంగయ్య పని నిమిత్తం కడ్తాల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మక్తమాధారం గేట్ సమీపంలోని పౌల్ట్రీ ఫామ్ వద్ద కుక్కలు అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో జంగయ్య కాలు విరగడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.



అర్ధరాత్రి దొంగల బీభత్సం


దుండగులు ధ్వంసం చేసిన గోడలు, షట్టర్

ఎల్ఐసీ ప్రీమియం పాయింట్‌లో చోరీ

- గోడలు, షట్టర్‌ను ధ్వంసం చేసిన దుండగులు
- రూ.30వేల నగదు అపహరణ

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలోని ఎల్ఐసీ ప్రీమియం పాయింట్‌లో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానికులు తెలిపిన ప్రకారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అరుణ్‌కుమార్‌గౌడ్ ఎల్ఐసీ ప్రీమియం పాయింట్ (కామన్ సర్వీస్ సెంటర్) ఏర్పాటు చేసుకున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం కార్యాలయం తెరిచేందుకు వెళ్లగా గోడలు, షట్టర్ ధ్వంసం చేసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా గ్లాస్‌డోర్ సైతం పగులగొట్టి కౌంటర్‌లోని రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అదనపు కట్నం వేధింపులకు..

మహిళ బలవన్మరణం

మీర్‌పేట: అదనపు కట్నం వేధింపులు భరించలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మీర్‌పేట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కిరణ్‌కుమార్ కథ నం ప్రకారం జిల్లెలగూడ కమల నెహ్రూ నగర్‌కు చెందిన శంకరయ్య కుమార్తె జింకల కవిత(23)కు గతే డాది ఏప్రిల్‌లో గుండేటి బాలరాజుతో వివాహమైంది. మూడు నెలలపాటు వీరు కాపురం సజావుగానే సాగింది. అనంతరం భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులు మొదలు పెట్టారు. దీంతో ఐ దు నెలల క్రితం సరూర్‌నగర్ మహి ళా పీఎస్‌లో భర్త, అత్తమామలపై ఫిర్యాదు చేసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో విరక్తి చెందిన ఆమె ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విధుల్లో ఉన్న పోలీసులపై దాడి

నలుగురికి రిమాండ్

పహాడీషరీఫ్: గొడవను నిలువరిచేందుకు వెళ్లిన పోలీసులపై దాడికి పాల్పడిన నలుగురు నిందితులను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. శ్రీసాయినగర్‌లో ఆదివారం అర్ధరాత్రి గొడవ జరుగుతోందని హరిగౌడ్ అనే వ్యక్తి డయల్–100కు సమాచారం ఇచ్చాడు. దీంతో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డు(డ్రైవర్) శ్రీధర్ ఘటనాస్థలికి వెళ్లి గొడవను ఆపేందుకు యత్నించారు. దీంతో దండెపు భరత్, కోదండ సాయి, భరత్, బాలాపూర్‌కు చెందిన మరాఠి దినేశ్ పోలీసులపై దాడికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


మహిమాన్వితం మహాప్రసాదం

బాలాపూర్ గణపతి చేతిలోని లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడుతుంటారు. ఇక్కడ స్వామి వారి చేతిలో పూజలందుకున్న లడ్డూ పొలంలో చల్లితే పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మిక. వేలం ప్రారంభించిన 17 ఏళ్ల వరకు స్థానికులకే అవకాశం ఇచ్చారు. తదనంతరం స్థానికేతరులకూ అవకాశం కల్పిస్తున్నారు.

బాలపూర్ లడ్డూకు భక్తజన ఆదరణ

- ప్రతీ సంవత్సరం పెరుగుతున్న పోటీ
- 2020లో సీఎం కేసీఆర్‌కు బహూకరణ
- ఈ ఏడాది ఎవరి సొంతమో?


కనకదుర్గ టెంపుల్ నమూనాలో బాలాపూర్ గణనాథుడి మండపం



బడంగ్‌పేట్: చవితి నవరాత్రుల సందర్భంగా తయారు చేసే లడ్డూ భారీ సైజుతో ఉండటంతో పాటు, వేలంలో రూ.లక్షలు పలికి భక్తులను ఆశ్చర్య పరుస్తుంది. వేలంలో ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తులు తమ పంటపొలాల్లో, వ్యాపార సంస్థలు, కార్యాలయాల్లో చల్లి గతంకంటే.. అధిక దిగుబడులు, రాబడులు అందుకున్నట్లు లడ్డూను సొంతం చేసుకున్నవారు చెప్పడం గమనార్హం. దీంతో బాలాపూర్ లడ్డూ మహిమపై భక్తులకు విశ్వాసం పెరిగింది.

తాపేశ్వరం 'హనీఫుడ్స్' నుంచి

తాపేశ్వరం మిఠాయి తయారీదారులు ఈ లడ్డూ తయారు చేస్తున్నారు. నాణ్యత, సైజు (21 కిలోలు)లో తేడా లేనప్పటికీ.. కొత్తగా లడ్డూ ఉంచేందుకు 2కిలోల వెండి గిన్నెను.. వేలంలో లడ్డు దక్కించుకున్న వారికి ఇస్తున్నట్లు హనీఫుడ్స్ తయారీదారుడు ఉమామహేశ్వర్ తెలిపారు. ఖైరతాబాద్ వినాయకుడి లడ్డూ తయారు చేసే తాపేశ్వరం వారే ఈ లడ్డూను తయారు చేసేందుకు అర్హత దక్కించుకోవడం మరో విశేషం.

1980లో మొదలై..

గణేశునిపై బాలాపూర్ వాసులకున్న భక్తి సేవాతత్పరతను చాటి చెబుతూ 44 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో చరిత్రను సృష్టిస్తోంది ఈ లడ్డూ 1994లో కొలన్ మోహన్‌రెడ్డి రూ.450తో ప్రారంభించిన వేలం నిర్విరామంగా కొనసాగుతూ.. 2022లో రూ.24.60లక్షలకు చేరుకుంది. ఈ సారి ఎంత ధర పలకుతుందో వేచి చూడాలిమరి.

గ్రామమంతాసాత్వికాహారమే..

నవరాత్రులు ముగిసేవరకు బాలాపూర్ వాసులు మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉంటారు. గణేశునితో పాటు లడ్డూ కూడా ప్రత్యేకంగా ప్రతిరోజు పూజిస్తారు. ప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్నవారే కాకుండా ఆ లడ్డూ దర్శించి పూజించుకున్నవారందరూ సుఖసంతోషాలతో ఉంటున్నామని వారి అనుభవాలను చెబుతుంటారు. నిమజ్జనానికి తరలించే రోజు తెల్లవారు జామున 4 గంటలకు గణనాథుడిని కదిలించి, ఊరి బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో కోలాటాలు భక్తి పాటలతో భజనలు నిర్వహిస్తూ ఊరందరికీ దర్శన భాగ్యం కల్పిస్తారు. తిరిగి 8 గంటలకు బొడ్రాయి వద్దకు చేరుస్తారు. 8.30 గంటలకు లడ్డూ వేలంను ప్రారంభిస్తారు.

స్పెషల్ ప్రొటెక్షన్

భారీ సైజు ఉండే బాలాపూర్ గణనాథుడి నిమజ్జనానికి తరలించేందుకు పోలీసు బందోబస్తు భారీగా ఉంటుంది. 1983 ఊరేగింపులో ఘర్షణలు చెలరేగి నగరమంతా వ్యాపించడంతో పోలీసుశాఖ అప్రమత్తమయింది. ఇక నాటి నుంచి ఏ గణనాథునికి కల్పించని ప్రొటెక్షన్ బాలాపూర్‌కు కల్పిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో వేలంలో లడ్డూ కొనుగోలు చేసే సాంప్రదాయం ఇక్కడి నుంచే ప్రారంభమయింది. నిమజ్జనంలో భాగంగా.. పాతబస్తీ, బార్కస్, చాంద్రాయన్‌గుట్ట, అలియాబాద్, చార్మినర్, ముస్లింబస్తీలు, కాలనీల మీదుగా ఊరేగుతూ హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం అవుతుంది. లంబోదరుడి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

వేలం నిధులతో...

వేలం నిధులతో బాలాపూర్‌లోని హనుమాన్ మందిరం, లక్ష్మీ గణపతి మందిరాలకు రూ.28.55 లక్షలు కేటాయించి నిర్మించారు. రూ.1.45 లక్షలను బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు వెచ్చించారు. రూ.1.12 లక్షలను వేణుగోపాలస్వామి ఆలయానికి, రూ.లక్షను మహబూబ్‌నగర్ వరద బాధితులకు, రూ.27.89లక్షలతో పోచమ్మ ఆలయం, రూ.66.50 లక్షలతో గణేశ్‌చౌక్ నిర్మాణం, రూ.1.36లక్షలతో శివాలయం అభివృద్ధి, రూ.8.55 లక్షలతో మహంకాళీ మందిరం, రూ.1 లక్షతో మల్లన్న మందిరం, రూ.3 లక్షలతో కంఠమహేశ్వరం టెంపుల్ అభివృద్ధికి, సీసీ కెమెరాలకు రూ.1.55లక్షలు, రూ.1.49 కోట్లను వేలం నిధులను ఖర్చు చేశారు.

భక్తి శ్రద్ధలతో పూజిస్తాం



యేటా గణనాథునికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తాం. ఈ సారి గణేశ్‌ను కిరీటంపై ఐదు తలల నాగేంద్రుడు దర్శనం ఇచ్చేలా ఏర్పాటు చేయించాం. అలాగే మండపాన్ని విజయవాడ కనకదుర్గా టెంపుల్‌ను పోలిన విధంగా తీర్చిదిద్దాం. భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం. మండపం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పోలీసు బందోబస్తు ఉంటుంది.

– నిరంజన్‌రెడ్డి, గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు

లడ్డూను దక్కించుకున్నవారి వివరాలు

క్ర.సం.	పేరు	సం.	రూ.
1	కొలన్ మోహన్‌రెడ్డి	1994	450
2	కొలన్ మోహన్‌రెడ్డి	1995	4500
3	కొలన్ కృష్ణారెడ్డి	1996	18000
4	కొలన్ కృష్ణారెడ్డి	1997	28000
5	కొలన్ మోహన్‌రెడ్డి	1998	51000
6	కళ్లెం అంజిరెడ్డి	1999	65000
7	కళ్లెం ప్రతాప్‌రెడ్డి	2000	66000
8	జి.రఘునందన్‌చారి	2001	85000
9	కందాడ మాధవరెడ్డి	2002	1.5 లక్షలు
10	చిగురింత బాల్‌రెడ్డి	2003	1.55 లక్షలు
11	కొలన్ మోహన్‌రెడ్డి	2004	2.1 లక్షలు
12	ఇబ్రాం శేఖర్	2005	2.8 లక్షలు
13	చిగురింత తిరుపతిరెడ్డి	2006	3 లక్షలు
14	జి.రఘునందన్‌చారి	2007	4.15 లక్షలు
15	కొలన్ మోహన్‌రెడ్డి	2008	5.7 లక్షలు
16	సరిత	2009	5.10 లక్షలు
17	కొడాలి శ్రీధర్‌బాబు	2010	5.35 లక్షలు
18	కొలన్ బ్రదర్స్	2011	5.45 లక్షలు
19	పన్నాల గోవర్ధన్‌రెడ్డి	2012	7.50 లక్షలు
20	తీగల కృష్ణారెడ్డి	2013	9.26 లక్షలు
21	సింగిరెడ్డి జైహింద్‌రెడ్డి	2014	9.50 లక్షలు
22	కళ్లెం మధన్‌మోహన్‌రెడ్డి	2015	10.32 లక్షలు
23	స్కైలాబ్‌రెడ్డి	2016	14.65 లక్షలు
24	నాగం తిరుపతిరెడ్డి	2017	15.60 లక్షలు
25	తేరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా	2018	16.60 లక్షలు
26	కొలన్ రాంరెడ్డి	2019	17.60 లక్షలు
27	సీఎం కేసీఆర్‌కు	2020	లడ్డూ బహూకరణ
28	రమేష్ యాదవ్, మర్రి శశాంక్‌రెడ్డి	2021	18.90 లక్షలు
29	వంగేటి లక్ష్మారెడ్డి	2022	24.60 లక్షలు

ఆత్మరక్షణపై అవగాహన సదస్సు

శంషాబాద్ రూరల్: విద్యార్థులు, మహిళల రక్షణపై షీటీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని ఒయాసిస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో షీటీం పనితీరును వివరించారు. మహిళలు ఆపద సమయంలో 100 నంబరు లేదా 94906 17444 షీటీం నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒంటరి ప్రయాణంలో సమస్యలు ఎదురైతే షీటీంను సంప్రదించి పరిష్కారం చేసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవడంతో పాటు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమతంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో కూడా షీటీంను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీం హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్‌రెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి ప్రమీల పాల్గొన్నారు.

మళ్లీ బీజేపీదే అధికారం


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 1న నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నేత ఆచారి కోరారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు అందజేశారు. మోదీ సభకు జన సమీకరణపై చర్చించారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. దేశంలో మూడో సారి బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో నియంతపాలన సాగిస్తున్న ప్రభుత్వానికి ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కండె హరిప్రసాద్, ఎన్నం శేఖర్ రెడ్డి, నర్సింహా, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

డీసీపీ చింతమనేని శ్రీనివాస్


మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

తుర్కయంజాల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటే కీలకమని మహేశ్వరం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని గణేశ్ నగర్ ఫేజ్–2లో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ఏడు కొండల్ యాదవ్, తగరం సత్యనారాయణ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం డీసీపీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అన్ని కాలనీల ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల సీఐ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, ఎస్.ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను వదిలేశారు

- వచ్చే ఎన్నికల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లు కేటాయించాలి
- విద్యార్థి నేతల రాజకీయ డిక్లరేషన్


రాజకీయ డిక్లరేషన్ విడుదల చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారులను, ఆత్మబలిదానాలు చేసుకున్న కుటుంబాలను వాడుకుని వదిలేస్తే చరిత్ర క్షమించదని పలువురు విద్యార్థి నేతలు అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో టీఎస్ జాక్, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ విద్యార్థి నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీఎస్ జాక్ చైర్మన్ రుద్రవరం లింగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థి నేతలు ప్రసంగించారు. నాడు చదువులను వదులుకొని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాధనలో భాగస్వాములైన విద్యార్థులు నేడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకోగా పలువురు లాఠీదెబ్బలు, పోలీసు కేసులతో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. విద్యార్థులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న పార్టీలు వారిని విస్మరించడం దారుణమన్నారు. ఉద్యమ నేతలకు ఉద్యోగాలు రాక, రాజకీయ అవకాశాలు దక్కక ఆర్థికంగా, ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నేతలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని డిక్లరేషన్‌లో కోరారు.

రాజకీయ డిక్లరేషన్ అంశాలివీ..

- ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థినేతలకు అన్ని పార్టీలు 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ టిక్కెట్లు, 2 మంత్రి పదవులు ఇవ్వాలి.
- నామినేటెడ్ పదవులతో పాటు పార్టీలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో పదవులు ఇవ్వాలి.

అలాంటి పార్టీలకే తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల మద్దతు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు రుద్రవరం లింగస్వామి, దుర్గం భాస్కర్, శరత్, వట్టికూటి రామారావుగౌడ్, మేడి రమణ, నెహ్రూనాయక్, బుల్లెట్ కృష్ణ, గాదె వెంకట్, పాల్వాయి నగేష్, విజయ్, పూసల రమేష్, దర్శన్, నాగేశ్వర్‌రావు, కంచర్ల బద్రీ, నర్సింహా, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

అత్తాపూర్: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌కు చెంది న సయ్యద్ ఖైసర్ (69) ఈనె ల 24న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబసభ్యు లు స్థానిక ప్రాంతాలు వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు న మోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివరాంపల్లిలో కార్మికుడు..

వెస్ట్ బెంగాల్‌కు చెందిన సోమేల్ సోరేన్ (36) అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శివరాంపల్లిలో నివాసముంటూ కార్మికుడిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా పని నిమిత్తం వెళ్లిన సోరేన్ కనిపించకుండా పోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.